లేపాక్షి ఆలయం విశేషాలను తెలుసుకుంటున్న జి-20 ప్రతినిధులు

ఆర్‌హెచ్, ఈసీలకు అ'ధనం'..!

- చలానా కన్నా.. కమీషన్ అధికం
- చిలమత్తూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వసుళ్ల దందా
- 5 గంటల తరువాతనే అన్ని పనులూ..

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతి దందా జరుగుతోంది. ప్రతి పనికీ ఇంతా.. అంతా అంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున దండుకుంటున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. కార్యాలయానికి సంబంధించి రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్నారు. ఈయన స్థానంలో కొత్తగా సీనియర్ అసిస్టెంట్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు కార్యాలయంపై పట్టులేక పోవడంతో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసే ఓ ప్రయివేటు వ్యక్తి అన్నీతానై చక్రం తిప్పుతూ ప్రజల వద్ద వేలాది రూపాయలు దండుకుంటున్నట్లు తెలుస్తోంది. కార్యాలయంలో ఏ పని జరగాలన్నా ప్రతి పనికీ డబ్బులు అడుగుతూ సదరు కంప్యూటర్ ఆపరేటర్ దందాకు పాల్పడుతున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పథకం కింద జరుగుతున్న భూ రీ సర్వే నేపథ్యంలో ఆర్‌హెచ్, ఈసీ నకళ్లకు డిమాండ్ పెరిగింది. దీనిని ఇచ్చేందుకు ప్రభుత్వంకు చెల్లించే చలానా కన్నా, కమిషన్ రూపంలో ఇచ్చుకునేదే అధికంగా ఉంటోందని ప్రజలు వాపోతున్నారు.

శాశ్వత భూ హక్కు... భూ రక్షతో డిమాండ్..

మండలంలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పథకంలో భాగంగా భూమి రీ సర్వే జరుగుతున్న నేపథ్యంలో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో భూమి ఆ రైతుకు ఎలా వచ్చింది అన్న ప్రశ్నకు సమాధానం కావాలంటే సర్వే నెంబర్ చరిత్ర అవసరం అవుతోంది. దీంతో భూ ప్రాథమిక రికార్డులుగా ఉన్న డైక్లాట్ మొదలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లభ్యమయ్యే ఆర్‌హెచ్, ఈసీలకు ప్రాధాన్యతతో పాటు వాటి నకళ్లకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలోనే దానిని అదనుగా చేసుకుని అమాయక భూ యాజమానులు రైతులు నుంచి పెద్ద మొత్తంలో వసుళ్లుకు పాల్పడుతుండటం గమనార్హం.

5గం॥ తరువాతే ఈసి, ఆర్‌హెచ్

సబ్ రిజిస్టర్ కార్యాలయంలో లభ్యమయ్యే ఆర్‌హెచ్ కాపీలు నుంచి ఈసీలు నకలు వరుకు ఏది కావాలన్నా దరఖాస్తు పెట్టుకున్న వారి వద్ద చలనా పేరుతో డబ్బులు కట్టించుకోవడం దానికి రసీదు ఇవ్వక పోవడం సర్వసాధారణం అయ్యింది. దీనికి తోడు సాధారణంగా ఆర్‌హెచ్ కాపీకి రూ.400 చలానా అయితే సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సాయంత్రం ఐదు గంటల తర్వాత ఆ నకళ్లు కావాల్సిన వారిని రమ్మనడం అదనంగా రూ.600 వసూలు చేసి, తరువాత వాటి పత్రాలు ఇవ్వడం పరిపాటిగా మారింది. గత కొన్ని రోజులుగా నిత్యం ఇదే తంతు జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఈసీకి మాన్యువల్‌కు ఓ రేటు, కంప్యూటర్ ఈసీకి ఓ రేటు ఉంటుంది. ఇక్కడ ఏది కోరినా అదనంగా రూ. 600 చెల్లించకమాత్రం తప్పడం లేదు. అవసరాన్ని బట్టి ఈ మొత్తాన్ని మరింత పెంచేస్తున్నారు. ఇక రోజు వారి కార్యాలయంలో పని చేసే మధ్యవర్తులు రియల్టర్‌లు ఆర్‌హెచ్, ఈసీకి అదనంగా రూ.200 చెల్లిస్తున్నట్లు తెలుస్తుంది. ముందే డబ్బులిస్తే క్షణాల్లో పని అయిపోతోంది. డబ్బులు ఇవ్వని పక్షంలో సర్వర్ పనిచేయడం లేదంటూ తిప్పుకుంటున్నారు. చేసేది లేక చాలా మంది డబ్బులు అదనంగా సమర్పించి వారికి కావాల్సిన ఈసీ పత్రాలను తీసుకుని వెళ్తున్నారు. ఇటీవల చిలమత్తూరు సబ్‌రిస్టర్ కార్యాలయం వద్దకు 5 గంటల తరువాత వెళ్తే ఇలాంటి పరిస్థితి నిత్యం కన్పిస్తూనే ఉంది. ప్రయివేటు కంప్యూటర్ ఆపరేటర్‌లు, సిబ్బందిలో కొందరు అవినీతికి పాల్పడుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ అవినీతి దందాపై నిఘా ఉంచాల్సిన ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం అక్రమార్కులకు అదనపు బలంగా మారుతోంది.

చిలమత్తూరు సబ్‌రిజిస్టర్ కార్యాలయం

చర్యలు తీసుకుంటాం

ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ పారిజాత

సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వసుళ్ల పర్వంపై ప్రజాశక్తి ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ పారిజాతను ప్రజాశక్తి వివరణ కోరింది. దీనిపై స్పందించిన అధికారి అక్కడి సిబ్బందితో వెంటనే మాట్లాడారు. ఈసీ నకళ్లకు సంబంధించి బిల్లులు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. బిల్లు పుస్తకాలు అయిపోవడంతో తెల్లకాగితంపై రాసి ఇస్తున్నామంటూ సిబ్బంది సమాధానం ఇచ్చారు. అనంతరం సబ్‌రిస్ట్రార్ ప్రజాశక్తితో మాట్లాడారు. భూ రీ సర్వే నేపథ్యంలో ఈసీ, ఆర్‌హెచ్ కాపీలకు ధరఖాస్తులు అధికంగా వస్తున్న మాట వాస్తవం అన్నారు. దీనికి సంబంధించి బిల్లులు ఇవ్వడం లేదన్నది తనకు తెలియదని, ఇకపై అలా జరగకుండా అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన అధిక మొత్తంలో డబ్బులు వసుళ్లు చేస్తే తనకు ఫిర్యాదు చేయాలన్నారు. అధికంగా డబ్బులు వసూళ్లు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లేపాక్షిలో జి-20 ప్రతినిధులు

శిల్పకళా వైభవం అద్భుతమని కితాబు

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షిలో జి-20 విదేశీ ప్రతినిధులు సందర్శించారు. మంగళవారం సాయంత్రం కర్నాటక రాష్ట్రం పావగడ నుంచి లేపాక్షి ఆలయ సందర్శనకు విచ్చేశారు. ముందుగా లేపాక్షి ఆలయం వద్దకు చేరుకున్న 29 మంది జి-20 విదేశీ ప్రతినిధులకు కలెక్టర్ పి.బసంత్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అమరావతి సర్కిల్ ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ఆర్కియాలజిస్టులు సూర్యప్రకాష్, కమలహాసన్‌లు లేపాక్షి ఆలయ ప్రాశస్త్యం, చరిత్ర, దేవాలయ నిర్మాణం, కట్టడాలు, సభా మండపం, విజయనగర సామ్రాజ్యంలో ఆలయానికి ఉన్న ప్రాధాన్యత, శిల్ప సంపద, సీతమ్మ పాదం, భోజనశాల, వేలాడే స్తంభం, 680 స్తంభాలు తదితర వివరాలను తెలియజేశారు. వీటి గురించి తెలుసుకున్న విదేశీ ప్రతినిధులు ఆలయం అద్భుతం అని కొనియాడారు. ముఖ్యంగా వేలాడే స్తంభాన్ని చూసి వారు ఆశ్చర్యపోయారు. ఏకశిలా గణేషుడు, నాగలింగం విశిష్టత, శిల్పకళా సంపద, చరిత్ర గురించి తెలుసుకున్నారు. లేపాక్షి ఆలయం సందర్శన సందర్భంగా తిలకించిన దశ్యాలను వారి సెల్‌ఫోన్‌లలో బంధించారు. అనంతరం లేపాక్షి ఆలయం నుంచి బయలుదేరి వెళ్లి అతి పెద్ద ఏకశిలా నంది విగ్రహాన్ని తిలకించారు. లేపాక్షి పర్యటన సందర్భంగా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అమరావతి సర్కిల్ ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ డా॥గోపీనాథ్ జన, డివైఎస్ఏఈ కె.వీరాంజనేయులు, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు డివి.బోయి, పి.శ్రీనివాసరావు, ఏ.భానుప్రకాష్ వర్మ, అనంతపురం సర్కిల్ ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా కన్జర్వేషన్ అసిస్టెంట్ పి.బాలకష్ణారెడ్డి, ఏఎస్పీ రామకష్ణ ప్రసాద్, డీఎస్పీలు భవ్యకిషోర్, టిడి.యశ్వంత్, పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

భూముల పరిశీలన

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

మండల పరిధి మరికొమ్మదిన్నె, ధనియాలు చెరువు, పెడబల్లి గ్రామాల పరిధిలో భూ పంపిణీకి సిద్ధంగా ఉన్న భూములను ఆర్డీవో రాఘవేంద్ర మంగళవారం పరిశీలించారు. వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న భూములను గుర్తించి భూ పంపిణీ జాబితా తయారు చేయాలని అధికారులను ఈసందర్భంగా ఆదేశించారు. వ్యవసాయ వినియోగానికి అనుకూలంగా లేని భూములను జాబితా నుంచి తొలగించాలన్నారు. ఈనేపథ్యంలో జోకల ప్రాంతానికి చెందిన రైతులు ఆర్డీవోకు తమ సమస్యను వివరించారు. గతంలో తాము ఈ భూములు సాగు చేశామని, గిట్టుబాటు కాక కొన్ని సంవత్సరాలుగా వదిలేయడంత భూముల్లో చెట్లు పెరిగాయన్నారు. అంతమాత్రాన తమ భూములను పంపిణీ జాబితా నుంచి తొలగించడం అన్యాయమని వాపోయారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఇళ్ల స్థలాల కోసం వినతి

ప్రజాశక్తి - చిలమత్తూరు

వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మండలంలోని చాగలేరు పంచాయతీ పరిధిలోని పెద్దిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన దళితులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ హనుమంతుకు మంగళవారం సమర్పించారు. దశాబ్దాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు తర్వాత తమకు ఇళ్ల స్థలాలు కేటాయించలేదన్నారు. ఉమ్మడి కుటుంబాలుగా ఉన్న తనకు ఇళ్లు ఏమాత్రం సరిపడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తమ ఇబ్బందిని చూసిన ఆర్డీటీ ప్రతినిధులు గృహాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. తమకు గ్రామ సమీపాన ఉన్న 6 ఎకరాల ప్రభుత్వ స్థలంలో స్థలాలు కేటాయిస్తే ఇళ్ల నిర్మాణం చేసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రమేష్, మద్దిలేటి, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఈ-పంట నమోదు

కలెక్టర్ బసంత్ కుమార్

సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - కొత్తచెరువు

రబీ సీజన్లో నిర్వహించిన ఈ పంట నమోదు కార్యక్రమం పక్కాగా చేపట్టామని కలెక్టర్ బసంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కొత్తచెరువు మండలంలోని కొత్తపల్లి, మీర్జాపురం, కె.లోచర్ల గ్రామాల్లో జాయింట్ అజమాయిషీ కింద చేపట్టిన ఈ పంట నమోదు సూపర్ చెక్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల పొలాలను పరిశీలించారు. ఇందులో భాగంగా పంట వివరాలు సక్రమంగా నమోదు అవుతున్నాయా లేదా అనేది పరిశీలించారు. ముందుగా కొత్తపల్లి గ్రామంలో చంద్రమోహన్ రెడ్డి రైతు పొలంలో మిరప, బెండ పంటలను పరిశీలించి వివరాలు సక్రమంగా నమోదు చేశారా అని ఆరా తీశారు. అనంతరం తలమర్ల రెవెన్యూ పరిధిలోని మీర్జాపురం గ్రామంలో రైతు భూమన్నగారి వెంకట రెడ్డి పొలంలో వేరుశెనగ పంటను కలెక్టర్ పరిశీలించారు. అలాగే లోచర్ల గ్రామంలో కూడా ఈ పంట నమోదును పరిశీలించారు. అన్ని రకాల వివరాలు నమోదు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే జాయింట్ కలెక్టర్ చేతన్ ఈ పంట నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బైరాపురం లోచర్ల కొత్త చెరువులోని ధర్మవరం రోడ్డులో రైతు పిఎస్ శ్రీనివాసులు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు.

నాణ్యమైన సేవలు అందించాలి : మండలంలోని మైలసముద్రం, మీర్జాపురం, తలమర్ల గ్రామ సచివాలయాలను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పాఠశాలలను తనిఖీ చేయాలని, పాఠశాలల తనిఖీ సమయంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని సూచించారు. పాఠశాలల తనిఖీ అనంతరం ఫోటోలను పంపించాలన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో సర్వీసులను మరింత పెంచాలని, ఎప్పటికప్పుడు సర్వీసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ అటెండెన్స్ పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, తహశీల్దార్ రామాంజినేయరెడ్డి, ఎంపిడిఒ సిద్ధారెడ్డి, ఎడిఎ స్వయంప్రభ, ఏవో నటరాజ్, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలో రబీ సీజన్లో సాగుచేసిన వేరుశనగ పంట పొలాలను కలెక్టర్ బసంత్ కుమార్ మంగళవారం పరిశీలించారు ఈ సందర్భంగా మండలంలోని జక్కసముద్రం, పులేరు, బూదిలి గ్రామాల్లో రబీలో సాగుచేసిన వేరుశనగ పంటలను పరిశీలించారు ఈ క్రాప్ బుకింగ్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులు, వ్యవసాయ శాఖ ఎడి అల్తాఫ్, మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా రైతులు పాల్గొన్నారు.

జిల్లా నుంచి నాలుగు ఇంద్ర బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రయాణికుల సౌకర్యం సత్యసాయి జిల్లా నుంచి నాలుగు ఇంద్ర బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హిందూపురం, కదిరి డిపోల నుంచి ఈ బస్సులు హైదరాబాదుకు నడుపుతున్నట్లు తెలిపారు. 8వ తేదీన బుధవారం సాయంత్రం నాలుగు బస్సులకు హిందూపురం నుంచి ఇంద్ర బస్సులను ఎమ్మెల్సీ ఇక్బాల్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల ప్రారంభిస్తారన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

పట్టాదారు పాసుపుస్తకాలివ్వాలని వినతి

ప్రజాశక్తి - సోమందేపల్లి

మండల కేంద్రంలోని పందుల పెంపకం దారులు వారు సాగు చేస్తున్న భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రెండవ సచివాలయంలో వ్యక్తిగత అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహించామని అనంతరం స్థానిక సచివాలయాలలో వ్యక్తిగత అర్జీలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారని చెప్పారు. ఈ మేరకు స్థానిక సచివాలయంలో వ్యక్తిగత అర్జీలు సమర్పించడానికి వెళ్లడంతో సచివాలయంలో పంచాయతీ సెక్రెటరీ మాత్రమే అందుబాటులో ఉన్నారని అన్నారు. అర్జీలు తీసుకోవడానికి సిబ్బంది సహకరించకపోవడంతో ధర్నా నిర్వహించామన్నారు. స్పందించిన పంచాయతీ సెక్రెటరీ సంబంధిత విఆర్ఒను పిలిపించి అర్జీలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాగుదారులు అంజనమ్మ, లక్ష్మీదేవి, వెంకటేశు, గుర్రప్ప, రవి, ఆంజనేయులు, నాగమ్మ, సుంకమ్మ, వెంకట లక్ష్మమ్మ, రామాంజనప్ప, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయం ముందు ఆందోళనకు దిగిన గ్రామస్తులు

నెలకు రూ.30 వేలు లీజు ఇవ్వాలి

- సోలార్‌కిచ్చే భూ రైతులకు చట్టబద్ధమైన న్యాయం చేయాలి
- వారికి ఏడాదికి రూ.1.50 కోట్లు ఆదాయం.... ◆ రైతుకు ఏడాదికి రూ.30 వేలేనా..!
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ◆ అదానీ సోలార్ ఎనర్జీ వరమా.? శాపమా.? సదస్సు

సదస్సులో ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా పరిధిలో గాలి, సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు కోసం రైతుల నుంచి తీసుకుంటున్న భూములకు నెలకు రూ.30వేలు లీజు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జిల్లాలో పెద్దఎత్తున ఏర్పాటవుతున్న 'అదానీ సోలార్ ఎనర్జీ వరమా.? శాపమా.?' అన్న అంశంపై అనంతపురం నగరంలోని ఎన్జీవో హోంలో సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నాడు సదస్సు జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంలో ఏడాదిలో 300 రోజుల వరకు ఎండ బాగా ఉండటమే కాకుండా ఎత్తైన ప్రాంతం కావడంతో విద్యుత్ ఉత్పత్తికి అనువైన ప్రాంతమని చెప్పారు. అందుకే ఈ ప్రాంతంలో పెద్దఎత్తున సౌర గాలి విద్యుత్ కేంద్రాల ఏర్పాటు జరుగుతోందన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల కోసమని సేకరిస్తున్న భూమి గతంలోలాగా కాకుండా లీజు పద్ధతిలో పెద్దపెద్ద కంపెనీలకు కట్టబెట్టడం జరుగుతోందన్నారు. ఏడాదికి రూ.30 వేలు మాత్రమే రైతులకు లీజు ఇస్తున్నారన్నారు. ఇది కేవలం ఒప్పందం ద్వారానే జరుగుతోందని చెప్పారు. ఏదైనా సమస్య వచ్చి లీజు చెల్లించకపోతే రైతు అడగటానికి వీల్లేకుండా ఉన్నందున చట్టబద్ధమైన రక్షణను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ఒక్క మెగావాట్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే ఐదు ఎకరాల విస్తీర్ణం అవసరమవుతుందని చెప్పారు. దీని ద్వారా 20 వేల నుంచి 25 వేల యూనిట్లు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దీని వల్ల కంపెనీకి నెలకు రూ.6,7 లక్షల ఆదాయం ఉంటుందని కంపెనీలు చూసే ఆడిటర్స్ చెబుతున్నారన్నారు. ఇలా ఏడాదికి రూ.1.50 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోందన్నారు. రైతుకు ఎకరానికి లీజు కింద ఏడాది మొత్తానికి ఇస్తున్నది కేవలం రూ.30 వేలు మాత్రమేనని చెప్పారు. ఇది సరైంది కాదని నెలకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయాల్సిన అవసరముందని తెలిపారు. యూనిట్‌కు రూ.1.99 అయితే సరిపోతుందని 'సెకీ' సంస్థ చెబుతోందని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు చేసుకున్న ఒప్పందాల ప్రకారం అదానీ సంస్థకు చెల్లిస్తున్నది రూ.2.49 అని వివరించారు. ఈ ధరకే చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు విద్యుత్‌నివ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ పరిశ్రమలకు రూ.7కుపైగా యూనిట్‌కు ఇస్తున్నారని పేర్కొన్నారు. దీనికితోడు ట్రూఅఫ్ పేరుతో అదనపు బాదుడు వేస్తుండటంతో చిన్న,మధ్య తరహా పరిశ్రమలు మూతపడుతున్నాయని చెప్పారు. వీటికి రూ.2.49తోనే విద్యుత్‌ను అందివ్వాలని డిమాండ్ చేశారు. కాలనుగుణంగా విద్యుత్ ధరలను ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ సమీక్షించి ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై రైతులు, ప్రజల్లోనూ అవగాహన కల్పించి పోరాటాలకు సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం సీనియర్ నాయకులు జి.ఒబుళు మాట్లాడుతూ జిల్లాలో పెద్దఎత్తున పవన, గాలి విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు జరుగుతోందన్నారు. రైతులకు ఇప్పుడు ఇస్తున్న లీజు ఏ మాత్రం సరిపోదని, దీన్ని పెంచే విధంగా ఒత్తిడి పెంచాల్సిన అవసరముందన్నారు. జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో 3.16 లక్షల ఎకరాల భూములను సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం కేటాయించారన్నారు. ఇంత పెద్దఎత్తున భూములను అదానీ వంటి కంపెనీలకు ప్రభుత్వాలు కట్టబెడుతున్నాయన్నారు. తద్వారా ఉపాధి కోల్పోతున్న వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో గ్రామాలకు గ్రామాలే సోలార్ పరిశ్రమల కిందపోతున్నాయన్నారు. అయితే ఆ ప్లాంట్లలో లభిస్తున్న ఉపాధి ఏమీ ఉండటం లేదని చెప్పారు. ప్రభుత్వాలు దీనిపై స్పందించి రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, ఒ.నల్లప్ప, బి.శ్రీనివాసులు, సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ఆర్వి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న బికె, పార్థసారథి

రాష్ట్రంలో టిడిపి నేతలపై కక్ష సాధింపు : బికె

గోరంట్ల : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కక్ష సాధింపు పాలన చేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి విమర్శించారు. మండలంలోని కొత్తపల్లి, కదిరేపల్లి, భూగానిపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పార్థసారథి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఈ తుగ్లక్ పాలనకు చరమగీతం పాడదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి హిందూపురం పార్లమెంటు కార్యదర్శి నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థ రెడ్డి, జిల్లా కార్యదర్శి వేణు, ఫిరోజ్ బాషా, శ్రీనివాసులు, నీలకంఠారెడ్డి, నరేష్ కుమార్ యాదవ్, గిరిధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జూడో పోటీల్లో కదిరి విద్యార్థినికి కాంస్య పతకం

కదిరి టౌన్ : ఖేలో ఇండియా జూడో పోటీలలో కదిరి పట్టణానికి చెందిన హారిక రెండు కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. కరాటే మాస్టర్ అక్బర్ అలీ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న హారిక కేరళ రాష్ట్రం లో జరుగుతున్న రెండవ ఖేలో ఇండియా మహిళల జూడో జాతీయ లీగ్, ర్యాంకింగ్ సౌత్ జోన్ పోటీల్లో 96 కేజీల విభాగంలో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించింది. అలాగే జూడో జూనియర్ విభాగంలో కూడా పాల్గొని అందులో కూడా కాంస్య పతకాన్ని సాధించినట్లు మాస్టర్ అక్బర్ అలీ చెప్పారు . రెండు కాంస్య పతకాలు సాధించిన హారికను మాస్టర్ అక్బర్ అలీ, విద్యార్థిని తల్లిదండ్రులు అభినందించారు.

స్కిల్ డెవలెప్‌మెంట్ కోర్సులను సద్వినియోగం చేసుకోండి

బుక్కపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి, సీడ్ యాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిల్క్ హబ్‌లో స్కిల్ డెవలెప్‌మెంట్ కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య , జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి షేక్ అబ్దుల్ కయాం, జాబ్ కోఆర్డినేటర్ ఆంజనేయులు తెలిపారు. ఇంటర్మీడియట్ , డిగ్రీ చదివిన విద్యార్థులకు ఫిబ్రవరి 10వ తేదీ నుంచి జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు ప్రభుత్వడిగ్రీ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి

అమరాపురం : మండలంలోని 11 గ్రామపంచాయతీలలో గ్రామ కార్యదర్శులు పంచాయతీ ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించాలని పెనుగొండ డిఎల్‌పిఒ బాలాజీ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపిడిఒ మునిస్వామి, ఇఒఆర్‌డి సుధాకర్ మండలంలోని గ్రామ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయా పరిధిలోగల భవనాల రీసర్వే తో పాటు కొళాయి, వీధి దీపాల పన్ను తదితర వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించి ఆదాయంపై దృష్టిసారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు ఈరన్న, నరేష్, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

కొత్తచెరువు : మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని పంచాయతీల అభివద్ధికి నిధులు కేటాయించాలని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గాయిత్రి అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ సమావేశంలో పలువురు సభ్యులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. కేశాపురం, తిరుమలదేవరపల్లి సర్పంచులు నరేందర్ రెడ్డి, కేశవరెడ్డి మాట్లాడుతూ గతంలో తాగునీటి కోసం బోర్లు వేసి పైపులైన్లు కూడా వేసామని వీటికి సంబంధించిన బిల్లులు ఇప్పటివరకు మంజూరు కాలేదని వాపయారు. ఇలా ఆయా గ్రామ పంచాయతీల్లో చేసిన, చేయబోయే పనులకు వెంటనే నిధులు కేటాయించాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈసమావేశంలో జెడ్పీటీసీ గంగాదేవి, వైఎస్ ఎంపిపి గంగారాజు, డిటి వెంకటరెడ్డి, ఎపిఎం నాగేంద్ర, ఎపిఒ నాగిరెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని జగరాజు పల్లి ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సంవత్సరం పదవ తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన రమణారెడ్డి మాథ్స్ మెటీరియల్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

తలుపుల : ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన తలుపుల వైద్యాధికారి మున్వర్‌బాషాను స్థానిక వైద్యసిబ్బంది మంగళవారం సన్మానించారు. అంతేకాకుండా అవార్డు అందుకున్న హెల్త్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, మలేరియా యూనిట్ సూపర్వైజర్ మహబూబ్ బాషా, ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ శరత్ రెడ్డిని సన్మానించారు.

వేలంపాట వాయిదా

ధర్మవరం టౌన్ : పట్టణంలోని నూతన కాయగూరల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ పై అంతస్తులో 51గదులకు మంగళవారం నిర్వహించాల్సిన వేలంపాటు వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఈ వేలం పాటకు 20 మంది వ్యాపారులు మాత్రమే హాజరయ్యారు. ఈ గదులకు మున్సిపల్ అధికారులు రూ.5లక్షల నుండి రూ.8 లక్షలవరకు గుడ్‌విల్‌కింద నిర్ణయించారు. అదేవిధంగా బాడుగలో 40శాతం రాయితీ కూడా ఇచ్చారు. ఈ మేరకు వేలంపాట ప్రారంభించగా వ్యాపారులు తమ సమస్యను కమిషనర్‌కు విన్నవించారు. ప్రస్తుత పరిస్థితులలో పై అంతస్తులో వ్యాపారాలు తక్కువగా జరుగుతాయని, బాడుగలో ఇచ్చిన రాయితీ మేరకు గుడ్‌విల్ కూడా 40 శాతంరాయితీ ఇవ్వాలని కోరారు. దీంతో కమిషనర్ వ్యాపారుల అభ్యర్థన మేరకు వేలంపాట వాయిదా వేసి తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్వో ఆనంద్, అధికారులు పాల్గొన్నారు.

నాడు నేడు పనులపై అసంతృప్తి

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని బాలుర పాఠశాలచ బాలికోన్నత జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు కెజిబివిలో పాఠశాలలో జరుగుతున్న నాడునేడు పనుల పురోగతిపై డిఇఒ మీనాక్షి అసంతృప్తి వ్యక్తం చేశారు. నాడు నేడు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. బైజూస్ యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఆదేశించారు.

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిఇఒ

గాడితప్పుతున్న సచివాలయ వ్యవస్థ

సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

మడకశిర రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ గాడితప్పుతోంది. కొందరు సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు. విధినిర్వహణలో అలసత్వం వహిస్తున్నారు. సమయపాలన పాటించడంలేదు. మండలం పరిధిలో గోవిందపురం గ్రామ సచివాలయంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకే సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్ టేబుల్‌పై ప్రశాంతంగా నిద్రపోయారు. సచివాలయ ఉద్యోగులు రిజిస్టర్‌లో సంతకం చేసి తర్వాత రికార్డులో ఎక్కడికెళ్తున్నారో రాయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడి అది ఏం లేదు. సంతకాలు పెట్టి ఎవరి దారిన వారు వెళ్లిపోవడమే. మంగళవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఇద్దరే ఉన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ విధులు మరిచి బాధ్యత మరిచి ప్రశాంతంగా నిద్రపోవడం ఆశ్చర్యాన్ని గురిచేసింది. ఎంతోమంది పింఛన్ల కోసం సమస్యలు పరిష్కారం కోసం సచివాలయానికి వచ్చి అధికారి నిద్రపోవడం చూసి వెనుతిరిగి వెళ్లారు. ఇక మహిళా పోలీస్, పంచాయతీ సెక్రెటరీ , ఎఎన్ఎం, సర్వేయర్ వేర్వేరు విధులు నిర్వహించారు. ప్రతిరోజు సంతకాలు పెట్టి సచివాలయంలో ఎవరు ఉండకుండా అధికారులు వెళుతున్నారని తమ సమస్యలు చెప్పడానికి వెళ్లితే సచివాలయాల్లో ఖాళీ కుర్చీలు కన్పిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు సచివాలయాల తనిఖీల సంగతి మర్చిపోయారని దీంతో వీరు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రజలకు సచివాలయంలో సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామ సచివాలయంలో ఉద్యోగులు ప్రజలకు సేవలందించే చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కదిరి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ఆశయాలు కొందరు సచివాలయ ఉద్యోగుల కారణంగా నీరుకారుతున్నాయి. కొందరు ఉద్యోగులు తమ విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొంతమంది సచివాలయ ఉద్యోగులు హాజరు పట్టికలో సంతకాలు చేసిన తర్వాత రికార్డులో ఎక్కడికెళ్తున్నారో మరో రికార్డులో నమోదు చేయాల్సిఉంది. అయితే ఇక్కడ అవేవీ పాటించడం లేదని తెలుస్తోంది. సమయానికి సచివాలయంలో అధికారులు దొరకరని ప్రజలు వాపోతున్నారు. సచివాలయాలను తనిఖీ చేయడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారని విమర్శలు వస్తున్నాయి. ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కొంతమంది కౌన్సిలర్లు సచివాలయ సిబ్బందిని బదిలీ చేసి

ఇష్టారాజ్యంగా ఉద్యోగుల పనితీరు
సమయపాలనకు తిలోదకాలు

కొత్తవారిని తమ వార్డుకు కేటాయించాలని అధికారులకు విన్నవించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నంబులపూలకుంట : మండల పరిధిలోని దనియాల చెరువు సచివాలయం సిబ్బంది పనితీరు మారలేదు. ఇక్కడి ఉద్యోగులు డ్రెస్‌కోడ్ పాటించడం లేదు. గత నెలలో కలెక్టర్ బసంత్‌కుమార్ సచివాలయాల తనిఖీ సమయంలో డ్రెస్‌కోడ్‌పై తీవ్రంగా హెచ్చరించారు. డ్రెస్‌కోడ్ పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే మండలంలోని పలువురు ఉద్యోగులు డ్రెస్‌కోడ్ పాటించడం లేదు. ఎంత చెప్పినా వీరు తీరు మారలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో నియంతపాలన : చిలకం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రాష్ట్రంలో నియంతపాలన సాగుతోందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన తన స్వగృహంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం జగన్, ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి చేస్తున్న నిర్వాహకాల వల్ల సొంత పార్టీలోనే ముఖ్యనేతలు చీదరించు కుంటున్నారన్నారు. పార్టీలోని సీనియర్ నాయకుడు ఆనం రాంనారాయణరెడ్డికే పార్టీలో రక్షణ లేక అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. పార్టీలో ఎవరైనా తప్పును ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. పొగిడిన సొంతపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు తిడుతున్నారంటే ఆయన పాలన ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. వాలెంటీర్లు ఇంటింటికి వెళ్లి పార్టీ చేస్తున్న వాటిపై చెప్పాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దోపిడీలు, దౌర్జన్యాలు, కబ్జాల గురించి వాలెంటీర్లు చెప్పాలా అని ఎద్దేవా చేశారు. ధర్మవరంలో ఖబరస్తాన్లో రాజకీయాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఖబరస్తాన్ సమస్య సద్దుమనిగిందని అనుకున్న సమయంలో కొందరు మళ్లీ చిచ్చుపెట్టేవిధంగా తెరలేపారని అన్నారు. ముస్లీం సోదరులు ఐక్యతగా ఉండి వారి సమస్యను వారే పరిష్కరిం చుకోవాలని సూచించారు.

విలేకరులతో మాట్లాడుతున్న చిలకం

నారాయణ విద్యా సంస్థలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి కదిరి టౌన్

నిబంధనలకు తిలోదకాలిచ్చిన నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్జాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ అనంతపురం పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాలలో కదిరి ప్రాంతానికి చెందిన భవ్యశ్రీ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోందన్నారు. విద్యార్థిని కళాశాలకు చెల్లించాల్సిన ఫీజులో కొంతభాగం చెల్లించకపోవటంతో కళాశాల యాజమాన్యం ఒత్తిడి చేయడంతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు.విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి కారణమైన కళాశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గంగరాజు, వెంకటేష్, అజారుద్దీన్, మహేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పరిగి

అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి హెచ్చరించారు. 'బరితెగించిన మట్టి మాఫీయా' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శాసనకోట పొలంలోని సర్వే నెంబర్ 381/2లో అనుమతి తీసుకుని పట్టా పొలంలో మట్టిని తరలించడాన్ని గమనించారు. తరలింపును అడ్డుకోవడానికి వెళ్లిన అధికారులపై దురుసు ప్రవర్తన చేసిన నిర్వాహకుడు జెసిబి టిప్పర్ పట్టా యజమాని పై కేసు నమోదు చేయాలని ఎస్ఐ నరేంద్రకు ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ మట్టి తరలింపు పై అనుమతులు ఇవ్వడమే కాకుండా తరలింపును గమనించాలని ఆమె సూచించారు కొంతమంది మట్టి మాఫియా దారులు ఒకచోటకు అనుమతి తీసుకునే మరోచోట మట్టిని తరలిస్తున్నారని ఇటువంటి వాటిపై ఇరిగేషన్ అధికారులు దృష్టిసారించాలని సూచించారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన చీరల వ్యాపారి పుట్లూరు నారాయణ(32) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... లక్ష్మీనగర్‌కు చెందిన పుట్లూరు నారాయణ అప్పుల బాధతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మొదట గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న మృతుని భార్య సోషల్ మీడియాలో వచ్చిన ఫోటోను చూసి తన భర్త పుట్లూరు నారాయణగా గుర్తించారు. నారాయణ . మొదట చేనేత మగ్గం నేసేవాడని ప్రస్తుతం చీరలు తెచ్చుకుని విక్రయిస్తున్నాడని తెలిపారు. కుటుంబ పోషణతోపాటు వ్యాపారం కోసం అప్పులు చేశాడని వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన జక్కా సతీష్, పార్వతి దంపతుల రెండో కుమారుడు జక్కా సుభాష్ (22) అనే యువకుడు ప్రమాదంలో గాయపడి మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు, యువకుడి తండ్రి సతీష్ తెలిపిన వివరాలు... జక్కా సతీష్ తన ఇద్దరు కుమారులతో కలిసి హ్యాండ్లూమ్ లిఫ్టింగ్ యంత్రాలను తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సతీష్ రెండో కుమారుడు సుభాష్ ద్విచక్రవాహనంలో ఆదివారం రాత్రి లక్ష్మీచెన్నకేశవపురానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో ఆటో ఇతని ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో సుభాష్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన సుభాష్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సవేరా ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అడ్మిట్ చేసుకోకుండా తిరిగి తీసుకెళ్లాలని సూచించారు. ఈ నేపథ్యంలో సుభాష్‌ను సోమవారం తిరిగి ధర్మవరానికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎంజెబి పాఠశాల విద్యార్థులకు విషజ్వరాలు

రొద్దం : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు బాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు విషజ్వరాలతో బాధ పడుతున్నారు. దీంతో పలువురు విద్యార్థులకు ఇళ్లకు వెళుతున్నారు. మండలంలోని ఆర్. మరువపల్లి గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాలలో దాదాపు 282మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ఐదారుగుకి మంగళవారం జ్వరం వచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. తాగునీటి వల్ల ఈ జ్వరాలు వచ్చినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా గదుల్లోని కిటికీలకు తలుపులు లేకపోవడంతో దోమల బారిన విద్యార్థులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది పాఠశాలలో మంగళవారం వైద్యసేవలు అందించారు. కొంతమంది విద్యార్థులు వారి గ్రామాలకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ విషయం పై ప్రిన్సిపల్ ను వివరణ కోరగా అనుకోకుండా వైరల్ ఫీవర్ వచ్చిందన్నారు. వెంటనే వైద్యాధికారులను పిలపించి చికిత్సలు అందించి కొంతమందిని ఇంటికి పంపించినట్లు తెలిపారు.

అమగొండపాలెంలో అవగాహన సదస్సు

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని అమగొండపాలెంలో హ్యూమన్‌రైట్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. అడవులను సంరక్షించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు భాస్కర్ నాయుడు, సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి ఆర్థికసాయం

కొత్తచెరువు : కొత్త చెరువులోనిబీసీ కాలనీకి చెందిన వడ్డే శ్రీరాములు ముత్రాపిండాలవ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య చికిత్సలకు ఉన్న ఆస్తులు అమ్మినా నయం కాలేదు. ఈ నేపథ్యంల శ్రీ వెంకటరమణ స్వామి బోర్ వెల్ అసోసియేషన్ సభ్యులు, శ్రీ అనంత సత్యసాయి వడ్డెర సంక్షేమ సంఘంనాయకులు దళవాయి కుటుంబసభ్యులు దళవాయి వెంకటనారాయణ, వడ్డే సిమెంట్ పోలన్న,వడ్డే పెదమారెప్ప తదితరులు ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి జరిపిటి కృష్ణమూర్తి బాధితుడిని పరామర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి 40వేల రూపాయలను వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తచెరువు వడ్డెర సంఘం నాయకులు సత్రం కాడ వెంకటేష్, చక్రపాణి, దండగల మారెప్ప, కుంచపు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఓబుల దేవర చెరువు :అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పోలప్ప, తహశీల్దార్ శ్రీధర్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, ఎంపిపి పర్వీన్‌బాను, జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రాజు నాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డితో పాటు సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఎంబిఎ చదువుతున్న విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యతను పెంపొందించుకుంటే అపారమైన ఉపాది అవకాశాలు లభిస్తాయని శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు, డీన్ సంతోష్‌రెడ్డి అన్నారు. మంగళవారం సప్తగిరి ఎంబిఎ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి అధ్యక్షతన మార్కెటింగ్ ఫెస్ట్ 2023 వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ ఎంబిఎ విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు, డీన్ సంతోష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిబిఎ, ఎంబిఎ విద్యార్థులు పాల్గొని వ్యాపారంలోని తమ ఉత్పత్తిని ప్రపంచ పోటీ మార్కెట్లో ఎలా విక్రయించాలి, వ్యూహాత్మక నైపుణ్యాలను, అంతేకాకుండా డిజిటల్ మార్కెటింగ్ మెలకువలను నేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివ శంకర్ రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్, పట్టణంలోని పలు కళాశాలల బిబిఎ, ఎంబిఎ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

చిత్రావతి ఒడ్డున వ్యర్థాల తొలగింపు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పట్టణ సమీపంలో గల చిత్రావతి నది పరివాహక ప్రాంతంలోని వ్యర్థ పదార్థాలు తొలగింపు శ్రమదాన కార్యక్రమాన్ని టిడిపి నాయకులు మంగళవారం చేపట్టారు. టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ఆయన మిత్రులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నదికి సమీపంలో ఉన్నవారు, ఇతరులు ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థాలు వేయడం ఆ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోంది. నదిని చూడటానికి వచ్చే పర్యాటకులు భక్తులు ఇబ్బందులు గమనించి వ్యర్థ పదార్థాలు తొలగించే పనికి స్వచ్ఛందంగా పూనుకున్నారు. ఈ సందర్భంగా సామ కోటి ఆది మాట్లాడుతూ సంబంధిత అధికారులకు పలుమార్లు తెలిపిన పట్టించుకోలేదన్నారు. దీంతో నది ఒడ్డున పరిశుభ్రంగా ఉంచడానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అమ్మినేని కేశవ నాయుడు, ఎం. మురళి, హనుమంతు, వెంకట రాముడు, రామకృష్ణ, సుధాకర్, రామచంద్ర పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగిస్తున్న నాయకులు

నీటి సరఫరాను మెరుగు పరుస్తాం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో వివిధ ప్రాంతాల్లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించడమే కాకుండా మరింత మెరుగు పరిస్తామని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. మంగళవారం పురపాలక సంఘంలోని 11వ వార్డు మాడాల్ కాలనీలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. సంక్షేమంతో పాటు పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి, ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వార్డు కౌన్సిలర్ అంజలి రమేష్ రెడ్డి, వార్డు ఇంచార్జ్ డిష్ చాందు, బాలు, కౌన్సిలర్లు రహమత్ బీ, నాగేంద్రమ్మ, అయూబ్, మల్లికార్జున, ముస్తాక్ పటేల్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

వైసిపి కార్యాలయంలా చేస్తున్నారు..

సబ్ రిజిస్టర్ తో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

రిజిస్ట్రార్‌ను నిలదీసిన పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరంలో జరుగుతున్న అక్రమరిజిస్ట్రేషన్లపై టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అది రిజిస్ట్రార్ కార్యాలయమా, లేక వైసిపి కార్యాలయమా అని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న కాలనీలోజరుగుతున్న రిజిస్ట్రేషన్ల మీద ఆయన తీవ్రంగా స్పందించారు. దశాబ్దాలుగా ఎంతో మంది నివాసముంటున్న స్థలాన్ని కాజేయాలని చూస్తున్న తరుణంలో వివాదం రాజుకుందని, ఇదివరకే అక్కడ రెండు సర్వేనెంబర్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు, ఇతర కార్యకలాపాలు ఆపేయాలని కోర్టు ఆదేశాలు ఉన్నా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని తెలుసుకున్న పరిటాలశ్రీరామ్ మంగళవారం సబ్ జిస్టర్ కార్యాలయానికి వెళ్లి సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. అసలు వివాదాల్లో ఉన్న భూములకు, ప్రభుత్వ స్థలాలను ఎలా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ప్రశ్నించారు. అయితే తమ వద్ద నిషేధిత జాబితా లేదని రిజిస్ట్రార్ చెప్పడం విడ్డూరంగా ఉందని శ్రీరామ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు, మున్సిపాలిటీ ఏర్పడి ఇన్నేళ్లు అయినా కనీసం నిషేధిత జాబితా లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. నిషేధిత జాబితాను తామే మున్సిపల్ కార్యాలయం నుండి తీసుకువచ్చి రిజిస్టర్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో అతికిస్తామన్నారు.రిజిస్ట్రేషన్లు కాకుండా యజమానులను ఒత్తిడికి గురిచేసి అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు.వీటి వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందని ఆరోపించారు. ముందుగా అక్రమ రిజిస్ట్రేషన్లు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతంకాటమయ్య, ఫణికుమార్, చింతలపల్లిమహేశ్ చౌదరి, పోతుకుంట లక్ష్మన్న, పురుషోత్తంగౌడ్, పరిశేసుధాకర్, దేవరకొండరామకృష్ణ రాంపురంశీన, కొత్తపేట ఆది తదితరులు పాల్గొన్నారు.